సాక్షి
తిరుపతి
సోమవారం । 8 । జనవరి । 2024



రంకెలేసిన కోడెగిత్తలు

రామచంద్రాపురం నూతిగుంటపల్లెలో ఆదివారం అట్టహాసంగా వరుష పందేలు నిర్వహించారు. - 8లో



ఎంబీయూలో స్పోర్ట్స్ డే

చంద్రగిరి మండలంలోని ఎంబీ యూనివర్సిటీలో ఆదివారం ఘనంగా స్పోర్ట్స్ డే నిర్వహించారు. - 8లో



స్పెల్ బీ సెమీస్‌కు విశేష స్పందన

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్పెల్ బీ సెమీ ఫైనల్‌కు విశేష స్పందన లభించింది. - 8లో

న్యూస్‌రీల్

వైభవంగా నీరాటోత్సవాల ప్రారంభం



ఊరేగుతున్న అమ్మవారు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఆండాళ్ నీరాటోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 13వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ క్రమంలో ఉదయం 5.30 గంటలకు ఆండాళ్ అమ్మవారు ఊరేగింపుగా బయలుదేరి రామచంద్ర కట్టపై ఉన్న నీరాట మండపానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి అభిషేకం, ఆస్థానం చేపట్టారు. సాయంత్రం వరకు అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఊరేగింపుగా గోవిందరాజస్వామి వారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రాధాకృష్ణ, ధనుంజయ పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షకు ఉచిత శిక్షణ

తిరుపతి కల్చరల్ : గ్రూప్-2 పరీక్షలు రాయనున్న మైనారిటీ అభ్యర్థులకు సీఈడీఎం ఆధ్వర్యంలో తిరుపతి ప్రజ్ఞ స్టడీ సర్కిల్ నందు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ సి.మల్లీశ్వరి ఆదివారం తెలిపారు. ఆసక్తిగలవారు గ్రూప్-2 దరఖాస్తు, ఆధార్, రేషన్‌కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు. టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాలు, నాలుగు ఫొటోలతో ఈనెల 10వ తేదీలోపు లక్ష్మీపురం సర్కిల్, టీటీడీ పద్మావతి కల్యాణ మండపాల వెనుక ఉన్న తిరుపతి శ్రీప్రజ్ఞ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని కోరారు. కోచింగ్‌తో పాటు ఉచిత స్టడీ మెటీరియల్ అందించడంతోపాటు గ్రాండ్ టెస్టులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే సైకాలజిస్ట్ హరిబాబుతో ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9912377296, 7382753550 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జాబ్..హబ్

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసింది. వివిధ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తోంది. ఉన్నత విద్యను అభ్యసించకపోయినా వారిలో నైపుణ్యాలకు మెరుగుపెట్టి ఉద్యోగావకాశం అందిస్తోంది. ట్రైనింగ్ పూర్తయిన వెంటనే సొంత కాళ్ల మీద నిలబడి కుటుంబాన్ని పోషించుకునే వెసులుబాటు కల్పిస్తోంది. అలాగే పలు కంపెనీల్లో చక్కటి వేతనంతో జాబ్ పొందేలా చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే మరింత మందికి జీవనోపాధి అందించేందుకు ప్రతిష్టాత్మకంగా స్కిల్ యూనివర్సిటీని నెలకొల్పేందుకు సన్నాహాలు చేస్తోంది.



- స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల్లో ఉపాధి కోర్సులు
- ప్రభుత్వ కళాశాలల్లోనే ఉచిత శిక్షణ
- ట్రైనింగ్ పూర్తయిన వెంటనే ఉద్యోగావకాశాలు
- ఏర్పేడులో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు సన్నాహాలు



సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని స్కిల్ హబ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు (ఫైల్)

తిరుపతి సిటీ : ప్రతి వ్యక్తికి ఉన్నత ఉద్యోగంలో స్థిరపడాలనే కోరిక ఉంటుంది. గత ప్రభుత్వాలు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను పట్టించుకోకపోవడం వల్ల మధ్యలోనే చదువులకు స్వస్తి చెప్పిన వారు కోకొల్లలు. చాలా మంది పదోతరగతి, ఇంటర్మీడియట్ వరకు మాత్రమే చదువుకుని ఇంటికే పరిమితమై ఉన్నారు. ఉద్యోగం చేయాలనే తపన ఉన్నా సరైన నైపుణ్యం లేక ఉద్యోగ వేటలో వెనుకబడిపోతుంటారు. ఇలాంటి వారికోసం ప్రభుత్వం పకడ్బందీగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేసింది. జిల్లాలోని మొత్తం ఏడు నియోజకవర్గాల్లో ఏడు స్కిల్ హబ్ సెంటర్లు నెలకొల్పింది. ప్రస్తుతం ఆయా సెంటర్లలో సుమారు 5వేల మందికి పైగా పలు కోర్సులలో శిక్షణ పొందుతున్నారు. తిరుపతిలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రీషన్ స్కిల్ కళాశాలలో స్వల్ప కాలిక హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నాక్)లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్లలో ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, టైలరింగ్, నిర్మాణ రంగానికి సంబంధించిన కోర్సులలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నారు. అలాగే ఎస్వీ పాలిటెక్నిక్ ప్రభుత్వ ఐటీఐ లోని స్కిల్ హబ్ సెంటర్లలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో యువతీ యువకులకు ఉచిత శిక్షణను అందిస్తున్నారు.

త్వరలోనే స్కిల్ వర్సిటీ

ఏర్పేడు మండలం కోబాక గ్రామం వద్ద ఏపీ స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం సుమారు 50ఎకరాలను సేకరించారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు పెరిగిన డిమాండ్

ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్లలో ఇంటర్మీడియట్ కనీస అర్హతగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ ఇస్తున్నారు. ఉపాధే లక్ష్యంగా డిగ్రీ పూర్తి చేసిన యువత సైతం ఈ కోర్సులలో శిక్షణ పొందుతున్నారు. ఇందులో కంప్యూటర్ వినియోగం, ఎంఎస్ ఆఫీస్, ఇంగ్లిష్, తెలుగు టైపింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. మూడు నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్ అందిస్తున్నారు. అనంతరం ప్రభుత్వ అనుబంధ, ప్రైవేటు సంస్థలలో ఉపాధి కల్పిస్తున్నారు. మరికొంత మంది అభ్యర్థులు పేరొందిన ఎమ్ఎన్‌సీ కంపెనీలలో ఉద్యోగఅవకాశాలు పొందుతున్నారు. రూ.12వేలు నుంచి రూ.18వేల వరకు ప్రారంభ వేతనం అందుకుంటున్నారు. నైపుణ్యం, సీనియారిటీని ఆధారంగా వేతనాలు మరింత పెరిగే అవకాశముటుంది. ప్రస్తుతం ఈ కోర్సుకు డిమాండు పెరిగింది.

నాణ్యమైన శిక్షణ

నేను ఇంటర్ పూర్తి చేసి స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ కంప్యూటర్ ఆపరేటర్ కోర్సులో చేరా. ఇక్కడ కంప్యూటర్ ఆపరేటింగ్, ఇంగ్లిష్, తెలుగు టైపింగ్, ఎమ్ఎస్ ఆఫీస్‌లో ఉచితంగా నాణ్యమైన శిక్షణ ఇస్తున్నారు. గతంలో లాగా ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో కాకుండా ప్రభుత్వ కళాశాలలోనే అధ్యాపకుల ఆధ్వర్యంలో శిక్షణ అందిస్తున్నారు. స్కిల్ సెంటర్ ద్వారా ఎమ్ఎన్‌సీ కంపెనీలలో ఆపరేటర్ ఉద్యోగం కల్పిస్తుండడం సంతోషకరం.

– అయేషా,
శిక్షణ పొందుతున్న అభ్యర్థి, వెంకటగిరి

శుభపరిణామం

ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్లలో కంప్యూటర్ ఆపరేటర్ కోర్సు పూర్తి చేసిన వారికి వంద శాతం ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. ఇప్పటికే కోర్సు పూర్తి చేసిన వారు పేరొందిన కంపెనీలలో పనిచేస్తున్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను స్కిల్ హబ్ సెంటర్లు చూపిస్తున్నాయి. త్వరలోనే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం శుభపరిణామం. దీంతో మాలాంటి ఎంతో మంది వృత్తి నైపుణ్యం పొందుతారు.

– నితీష్,
శిక్షణ పొందుతున్న అభ్యర్థి, వెంకటగిరి

ఉపాధి కల్పనకే..



జిల్లాలో ప్రస్తుతం ఉన్న స్కిల్ హబ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు వంద శాతం ఉపాధి లభిస్తుంది. ప్రధానంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు పూర్తి చేసి అభ్యర్థులకు వెంటనే ఉద్యోగాలలో చేరుతున్నారు. దీంతో పాటు భవన నిర్మాణం, హోటల్ మేనేజ్‌మెంట్ రంగాలకు సంబంధించి తిరుపతిలోని స్కిల్ హబ్ సెంటర్లలో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు శిక్షణ పొందుతున్నారు.

– లోకనాథం,
జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, తిరుపతి

పండుగలా 'జన్ భాగీదారి'



వెంకటరమణారెడ్డి, కలెక్టర్

తిరుపతి అర్బన్ : విజయవాడ స్వరాజ్ మైదానంలో ఈ నెల 19వ తేదీన బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పండుగలా జన్ భాగీదారి కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. సామాజిక న్యాయస్ఫూర్తిగా ప్రభుత్వం సుమారు రూ.400 కోట్లతో 20 ఎకరాల్లో అంబేడ్కర్ స్మృతి వనం ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో జన్ భాగీదారి చేపట్టాలని సూచించారు. ఇప్పటికే 4 నుంచి 8వ తేది వరకు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, డ్రాయింగ్, డిబేట్, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించామన్నారు.7వ తేది నుంచి గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలను ఆవిష్కరిస్తున్నామని వెల్లడించారు. 9 నుంచి 18వ తేదీ వరకు జిల్లా స్థాయిలో ఫొటో ఎగ్జిబిషన్, లఘు చిత్రాలను ప్రదర్శించాలని కోరారు. షెడ్యూల్ మేరకు రక్తదాన శిబిరాలు నిర్వహించాలన్నారు. 18న మారథాన్ రన్ చేపట్టాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 12 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 68,793 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,489 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.81 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

కలెక్టరేట్‌లో నేడు స్పందన

తిరుపతి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

చంద్రబాబు హామీలన్నీ మోసాలే!



సమావేశానికి హాజరైన బలిజ కులస్తులు

- రుణమాఫీ పేరుతో ముంచేశావు కదా
- మేనిఫెస్టోను అమలు చేసిన ఘనత జగన్‌దే
- రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- పుంగనూరులో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం ఆవిష్కరణ



శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు ద్వారకనాథరెడ్డి, శ్రీనివాసులు, పోకల అశోక్‌కుమార్

పుంగనూరు: ''ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చే హామీలన్నీ మోసాలే.. గతంలో ఇచ్చిన 600 హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదు.. రుణమాఫీ పేరుతో రైతులను నిట్టనిలువునా ముంచేశారు'' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. పుంగనూరులో సుమారు రూ.3 కోట్లతో నిర్మించిన శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి, రాయల విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మంత్రి ప్రసంగించారు. ప్రజలను మోసగించడమే చంద్రబాబు మేనిఫెస్టో అని అభివర్ణించారు. జన్మభూమి కమిటీల పేరుతో దోచుకుతిన్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని చెప్పారు. ఏ పార్టీ అయినా, కులం, మతం చూడకుండా పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కరోనాతో రాష్ట్రం రెండు సంవత్సరాలు ఆర్థిక సంక్షోభంతో కూరుకుపోయిందని చెప్పారు. అయినప్పటికీ మొక్కవోని దీక్షతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు క్రమం తప్పకుండా అమలు చేశారన్నారు. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పథకాలు కొనసాగుతున్నాయని వివరించారు. చంద్రబాబునాయుడు ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని రాష్ట్ర ప్రజలను మోసగించేందుకు కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి అధిక ప్రాధాన్యత కల్పించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనేనని కొనియాడారు. ప్రతిసారీ ఎన్నికల సమయంలో మాయమాటలతో మభ్య పెట్టడానికి వచ్చే నాయకులను ప్రజలు నమ్మొద్దని సూచించారు. పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల హామీలను నెరవేర్చినందుకు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.



సమావేశంలో సంఘటితంగా ఎంపీ గురుమూర్తి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తదితరులు

క్షేత్రస్థాయిలోకి 'సంక్షేమం'

- జగనన్న సైనికుల్లా పనిచేద్దాం
- వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించుకుందాం
- ఎంపీ గురుమూర్తి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలని ఎంపీ గురుమూర్తి, తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాయలసీమ రీజనల్ మీట్ నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలో ఎవరూ అందించలేనన్ని సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికి అందించిన గొప్ప నాయకుడు జగనన్న మాత్రమేనన్నారు. 14 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న చంద్రబాబుకు కూడా సాధ్యం కాలేదని వెల్లడించారు. పేదల అభ్యున్నతే పరమావధిగా సుపరిపాలన అందిస్తున్న జగనన్నను మళ్లీ గెలిపించుకునేందుకు వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం కీలకంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే పార్టీ సోషల్‌మీడియా చురుగ్గా పనిచేయాలని కోరారు. కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామడి సత్యనారాయణశెట్టి, నాయకులు ముక్కాల ద్వారకానాథ్ మురళీకృష్ణ, మువ్వల నరసింహులుశెట్టి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌గుప్తా ఎం. తేజ యశస్విగుప్తా, కార్యదర్శి తీర్థప్రసాద్, తిరుపతి అధ్యక్షుడు రవిచంద్రశేఖర్, కార్యదర్శి పుల్లిపాటి సురేష్ పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

వెంకటగిరి రూరల్ : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అండర్ -14 విభాగం క్రికెట్ పోటీలు పట్టణంలోని తారక రామా క్రీడా ప్రాంగణంలో హోరా హోరీగా ప్రారంభమయ్యాయి. గ్రౌండ్-ఏలో అనంతపురం- కడప జట్ల మధ్య పోటీ జరిగింది. కడప జట్టు టాస్ గెలచి బ్యాటింగ్ ఎంచుకుంది. 50 ఓవర్లకు 200 పరుగులు చేసి 7 వికెట్లు కోల్పోయింది. ఈ జట్టులో సూర్యతేజ 97 పరుగులు, ప్రశాంత్ 55 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 15.2 ఓవర్లకు 55 పరుగులు చేసి ఆలౌటైంది. 145 పరుగుల తేడాతో కడప జట్టు విజయం సాధించింది. గ్రౌండ్-బిలో చిత్తూరు- కర్నూలు జిల్లా జట్ల మధ్య జరిగిన క్రికెట్ పోటీలో చిత్తూరు జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లకు 227 పరుగులు చేసి 9 వికెట్లు కోల్పోయింది. ఈ జట్టులో వెంకట రిషి 106 పరుగులు, కల్యాణ్ 50 పరుగులు చేశారు. తనీశ్వర్ 60 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 44.3 ఓవర్లకు 115 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఓంకార్ 60 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టు 72 పరుగుల తేడాతో విజయం సాధించింది.

బాధ్యతగా రైతులందరికీ మేలు

- చంద్రగిరి మార్కెట్ యార్డులో కొలువు దీరిన కొత్త కమిటీ
- ప్రమాణస్వీకారానికి హాజరైన తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి



ప్రమాణస్వీకారం చేస్తున్న పాలకవర్గంతో తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

చంద్రగిరి : రైతులందరికీ మేలు చేకూరేలా మార్కెట్ కమిటీ బాధ్యతగా పనిచేయాలని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సూచించారు. ఆదివారం చంద్రగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం నిర్వహించారు. చైర్మన్‌గా కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా చేగు గోవర్ధన్ గుప్తాతోపాటు కమిటీ సభ్యులతో మార్కెట్ కమిటీ కార్యదర్శి ప్రమాణం చేయించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో తిరుచానూరు మార్కెట్ యార్డు పరిధిలోనే చంద్రగిరి ఉండేదని, 2019లో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాలను కలుపుకుని కొత్త మార్కెట్ యార్డు ఏర్పాటు చేశారని వివరించారు. ఇప్పుడు మూడో పాలక వర్గం బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని చెప్పారు. యార్డు అభివృద్ధికి తన వంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కొత్త కమిటీ ఆధ్వర్యంలో మోహిత్ రెడ్డికి నాగలి అందించి ఘనంగా సత్కరించారు. ఈ క్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే, తుడా చైర్మన్ సహకారంతో త్వరలోనే రైతు బజార్ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అనంతరం చంద్రగిరి క్లాక్ టవర్ నుంచి మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో నూతన పాలకవర్గంతో పాటు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పాల్గొన్నారు. చంద్రగిరి డివిజన్ పార్టీ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్తపేట బస్టాండ్ వద్ద కాయగూరలతో తయారు చేసిన అతి పెద్ద మాలను క్రేన్ సాయంతో వేసి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఐతేపల్లి పార్టీ డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి ఆధ్వర్యంలో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డితో పాటు నూతన పాలకవర్గాన్ని ఘనంగా సత్కరించారు. మార్కెట్ యార్డు నూతన డైరెక్టర్లు దాసరయ్యగారి మమత, ఉమ్మాది సురేఖ, షేక్ మహమ్మద్ హుస్సేన్, తలారి సుజాత, పి.ఉమాదేవి, కె.రవీంద్రనాథరెడ్డి, బి.ప్రశాంతి, సి.సరస్వతి, సి.మనోహర్ రెడ్డి, పి.మల్లిఖార్జున రెడ్డి, ఎస్.బావాజాన్, పి.భువనేశ్వరి, కె.మదన మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



నూతన కమిటీకి సత్కారం

సాక్షి స్పెల్‌బీ సెమీస్‌కు విశేష స్పందన

- మూడు ఉమ్మడి జిల్లాల నుంచి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

తిరుపతి ఎడ్యుకేషన్ : పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా, వారి ప్రతిభకు పదును పెట్టేందుకు సాక్షి స్పెల్‌బీ దోహదం చేస్తోంది. ఉన్నత విద్య అభ్యసించాలన్నా, ఉన్నత కొలువును సాధించాలన్నా ఆంగ్ల భాషపై పట్టు తప్పనిసరి. ఆంగ్ల భాషలో నైపుణ్యం, సామర్థ్యం ఉంటేనే నేటితరం ఉన్నతంగా రాణిస్తుంది. ఇంగ్లిష్‌పై విద్యార్థుల్లో అవగాహన కల్పించి, వారిలో నైపుణ్యం, ఆసక్తిని పెంపొందించేందుకు ఏటా సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా స్పెల్‌బీ పరీక్షలు నిర్వహిస్తోంది. తద్వారా వారిలో దాగి ఉన్న ప్రతిభకు పదును పెడుతోంది. ప్రాథమిక, క్వార్టర్, సెమీఫైనల్, ఫైనల్ నాలుగు దశల్లో స్పెల్‌బీ నిర్వహించి.. ఫైనల్‌లో సత్తా చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందిస్తోంది. ఈ పరీక్షకు ప్రధాన స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాఫ్టి, అసోసియేషన్ స్పాన్సర్‌గా రాజమండ్రికి చెందిన ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరిస్తున్నాయి. సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్షలకు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారు. ఎప్పటిలానే ఈ ఏడాది సైతం విద్యార్థులు ఈ పరీక్షకు అధిక సంఖ్యలో హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. అందులో భాగంగా ఆదివారం తిరుచానూరు రోడ్డు, శ్రీనివాసపురంలోని హోలీ గ్రీన్ పాఠశాలలో స్పెల్‌బీ సెమీఫైనల్స్ నిర్వహించారు. ఇదివరకు పాఠశాల స్థాయి, జిల్లా స్థాయి (క్వార్టర్ ఫైనల్స్)లో జరిగిన ఈ పరీక్షలో విజేతలకు సెమీఫైనల్స్ (మూడో రౌండు) పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ కడప, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

సాక్షి స్పెల్‌బీ సెమీ ఫైనల్ పరీక్షలు		
కేటగిరి 1	:	1, 2వ తరగతులు
కేటగిరి 2	:	3, 4వ తరగతులు
కేటగిరి 3	:	5, 6, 7వ తరగతులు
కేటగిరి 4	:	8, 9, 10వ తరగతులు



సాక్షి స్పెల్‌బీ సెమీ ఫైనల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆత్మవిశ్వాసం రెట్టింపు



విద్యార్థులు రాణించేందుకు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలి. అందుకు ప్రతి రోజూ ఇంగ్లిష్ భాషను సాధన చేయాలి. ఆంగ్లం న్యూస్ పేపర్లు, గ్రామర్‌తో పాటు ఇతర పుస్తకాలను చదవాలి. అర్థం కాని పదాలను డిక్షనరీ సాయంతో తెలుసుకోవాలి. అద్దం ముందు నిలబడి ఇంగ్లిష్‌లో మాట్లాడుతూ సాధన చేయాలి. విద్యార్థుల ఉన్నతికి బాటలు వేసేలా సాక్షి మీడియా గ్రూప్ స్పెల్‌బీ నిర్వహిస్తూ వారిలో ఆత్మస్థైర్యం, ఇంగ్లిష్ భాషపై పట్టు, నైపుణ్యం పెంపొందిస్తుండడం అభినందనీయం.

- సి.వేణుగోపాల్‌రెడ్డి, చైర్మన్, హోలీగ్రీన్ స్కూల్, తిరుపతి

బాగా ప్రాక్టీస్ చేశా



సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ సెమీ ఫైనల్ పరీక్షకు బాగా ప్రిపేర్ అయ్యా. స్పెల్‌బీ మెటీరియల్‌లోని కొత్త పదాలు, వాటి స్పెల్లింగ్స్ నేర్చుకున్నా. ఈ పరీక్షలో రాణించి ఫైనల్‌కు చేరుకుని అక్కడ నా ప్రతిభను చాటుకోవాలనుకుంటున్నా. **- ఈ.రుక్విద్, 3వ తరగతి, ప్రశాంత్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, తిరుపతి**

కొత్త పదాలు తెలిశాయి



స్పెల్‌బీ పరీక్షలో ఈ ఏడాది తొలిసారిగా పాల్గొన్నా. స్పెల్‌బీ మెటీరియల్‌లోని పదాలను రోజూ సాధన చేశా. ఇందులో చాలా వరకు కొత్త పదాలు ఉన్నాయి. వాటిని ఎలా పలకాలి, స్పెల్లింగ్ ఎలా రాయాలో మా టీచర్లను అడిగి తెలుసుకున్నా. కొత్త పదాలు వల్ల ఇంగ్లిష్ భాషపై పట్టు, నైపుణ్యం పెరిగింది. **- ఎం.లిపిక, 6వ తరగతి, జేసీఆర్ శ్రీచైతన్య స్కూల్, తిరుపతి**

ఇంగ్లిష్‌పై ఆసక్తి



స్పెల్‌బీ పరీక్షకు ఈ ఏడాది తొలిసారిగా హాజరయ్యా. పాఠశాల, క్వార్టర్ ఫైనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచి సెమీ ఫైనల్‌కు చేరడం సంతోషంగా ఉంది. స్పెల్‌బీ ద్వారా నాలో ఇంగ్లిష్ భాషపై ఆసక్తి పెరిగింది. కొత్త పదాలు తెలుసుకోవడంతో ఆ భాషపై పట్టు సాధించగలిగా. థ్యాంక్స్ టు సాక్షి. **- ఎస్.మొహమ్మద్ నిహాల్, 5వ తరగతి, నాగార్జున ఇంగ్లిష్ మీడియం స్కూల్, వైఎస్సార్ కడప**

స్పెల్లింగ్స్ నేర్చుకున్నా



నాకు ఇంగ్లిష్ భాష అంటే ఇష్టం. స్కూల్ లెవెల్‌లో అన్ని పదాలకు స్పెల్లింగ్స్ నేర్చుకున్నా. అయితే స్పెల్‌బీ ద్వారా కొత్త పదాలు, వాటి స్పెల్లింగ్స్‌తో పాటు ఆయా పదాలను ఎలా ఉచ్చరించాలి అనే విషయాలు నేర్చుకున్నా. గ్రామర్ బాగా తెలిసొచ్చింది. **- వి.దియ, 7వ తరగతి, ఎడిఫై స్కూల్, తిరుచానూరు**

నైపుణ్యం పెరిగింది



ఇంగ్లిష్‌పై ఆసక్తి పెరగడానికి స్పెల్‌బీ దోహదపడింది. అనేక కొత్త పదాలు తెలుసుకున్నా. ఈ స్పెల్‌బీ పరీక్ష ద్వారా ఇంగ్లిష్ భాషపై పట్టు, నైపుణ్యం పెరిగింది. సరళంగా, తప్పులు లేకుండా ఆంగలం మాట్లేడేందుకు స్పెల్‌బీ దోహదపడింది. **- ఎస్.విశాల్‌కుమార్‌రెడ్డి, 7వ తరగతి, రెయిన్‌బో స్కూల్, నెల్లూరు**

ఫైనల్ చేరడమే లక్ష్యం



స్పెల్‌బీ పరీక్షకు ప్రిపేరయ్యే కొద్దీ చాలా ఆసక్తి పెరిగింది. గత ఏడాది సెమీ ఫైనల్ వరకు వచ్చా. ఈ ఏడాది ఎలాగైనా ఫైనల్‌కు వెళ్లాలన్నదే నా లక్ష్యం. దీని కోసం స్పెల్‌బీ మెటీరియల్‌లో అనేక కొత్తకొత్త పదాలను స్పెల్లింగ్ తప్పులు లేకుండా రాసేందుకు బాగా సాధన చేశా. **- కె.భావన, 10వ తరగతి, సంసిద్ క్యాంఫోర్డ్ ఈస్ట్ క్యాంపస్ స్కూల్, చిత్తూరు**

విన్నర్ కావాలి



స్పెల్‌బీలో వరుసగా నాలుగు ఏళ్లు పాల్గొన్నా. ఈ ఏడాది ఐదో మారు. గత ఏడాది ఫైనల్ వరకు వెళ్లి రన్నర్‌గా నిలిచా. ఈ ఏడాది సాక్షి స్పెల్‌బీలో విన్నర్‌గా కావడమే నా లక్ష్యం. దీనికోసం స్పెల్‌బీ మెటీరియల్‌ను బాగా సాధన చేశాను. కొత్త పదాలు, వాటి స్పెల్లింగ్, ఉచ్చారణను మా టీచర్ ద్వారా నేర్చుకున్నాను. **- కె.జ్యోతిష, 9వ తరగతి, 10వ తరగతి, సంసిద్ క్యాంఫోర్డ్ ఈస్ట్ క్యాంపస్ స్కూల్, చిత్తూరు**

చిన్నారి కథ విషాదాంతం

చంద్రగిరి : ఇటీవల అదృశ్యమైన చిన్నారి కథ విషాదాంతమైంది. తప్పిపోయిన బిడ్డ తిరిగి వస్తుందని ఎదురు చూస్తున్న తల్లిదండ్రులకు పుట్టెడు శోకమే మిగిలింది. వివరాల్లోకెళితే.. జార్ఖండ్‌కు చెందిన రాజేష్ నాయక్ తన కుటుంబంతో కలసి స్థానిక మధు సిమెంట్ రాయి ఫ్యాక్టరీలో కూలీలుగా పనిచేస్తున్నారు. ఈనెల 2వ తేదీన రాజేష్ నాయక్ కుమార్తె సోని కుమారి(6) కనిపించకుండా పోయింది. బాధితులు ఈ మేరకు 3వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఎం.కొంగరవారి పల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో బాలిక మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న సీఐ రాజశేఖర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. సోని కుమారి మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

పోస్టుమార్టం ఆధారంగానే దర్యాప్తు

బాలిక మృతి కేసును పోస్టుమార్టం నివేదిక ఆధారంగానే దర్యాప్తు చేయనున్నట్లు డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాలిక ఆచూకీ కోసం 20 మంది సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టామన్నారు. బాలిక మృతి కేసును త్వరలోనే ఛేదిస్తామని స్పష్టం చేశారు.


సోని కుమారి (ఫైల్)

భారీ ఎత్తున సీఐల బదిలీలు

చిత్తూరు అర్బన్ : తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పనిచేస్తున్న సీఐలు భారీ ఎత్తున బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆదివారం అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మూడేళ్లకు పైబడి ఒకే చోట పనిచేస్తున్న సీఐలకు స్థానచలనం కల్పించారు. రెండు జిల్లాల్లో బదిలీ అయిన సీఐల వివరాలు ఇలా

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రాంతం
చిత్తూరు జిల్లా పరిధిలో.		
గంగిరెడ్డి	చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్	ఎస్‌బీ, చిత్తూరు
శ్రీధర్	కుప్పం అర్బన్ పోలీస్ స్టేషన్	సైబర్ క్రైమ్ సెల్, చిత్తూరు
బాలయ్య	దిశా, పీఎస్, చిత్తూరు	డీసీఆర్‌బీ, చిత్తూరు
సుబ్రహ్మణ్యం	డీసీఆర్‌బీ, చిత్తూరు	వీఆర్-ఎస్పీ, అనంతపురం
ఆశీర్వాదం	వీఆర్-ఎస్పీ, చిత్తూరు	వీఆర్-ఎస్పీ, అనంతపురం
ప్రసాద్‌బాబు	వీఆర్-ఎస్పీ, చిత్తూరు	వీఆర్-ఎస్పీ, సత్యసాయి జిల్లా
చల్లనిదొర	వీఆర్-ఎస్పీ, చిత్తూరు	వీఆర్, రేంజ్ ఆఫీస్, అనంతపురం
తిరుపతి జిల్లా పరిధిలో.....		
సుబ్రహ్మణ్యంరెడ్డి	తిరుపతి రూరల్ (ఎంఆర్‌పల్లి పీఎస్)	వీఆర్-ఎస్పీ, సత్యసాయి జిల్లా
విక్రమ్	బీఎస్ కండ్రిగ సర్కిల్	వీఆర్-ఎస్పీ, అనంతపురం
బాలకృష్ణ	ఆర్ఎస్‌టీఎఫ్-తిరుపతి	ఆర్ఎస్‌టీఎఫ్,తిరుపతి
రాజశేఖర్	చంద్రగిరి, యూపీఎస్	ఎస్‌బీ, తిరుమల
రామకృష్ణాచారి	ఎస్‌బీ, తిరుమల	వీఆర్-ఎస్పీ, తిరుపతి
లక్ష్మీనారాయణ	పుత్తూరు, యూపీఎస్	వీఆర్-ఎస్పీ అనంతపురం
ప్రవీణ్‌కుమార్	సీసీఎస్, తిరుపతి	వీఆర్-ఎస్పీ సత్యసాయి జిల్లా
శివప్రసాద్‌రెడ్డి	తిరుచానూరు పీఎస్	ఎస్‌బీ, తిరుపతి
సురేంద్రనాథ్‌రెడ్డి	భాకరాపేట సర్కిల్	పీసీఆర్, తిరుపతి
జగన్‌మోహన్‌రెడ్డి	తిరుమల వన్‌టౌన్ పీఎస్	డీటీసీ, తిరుపతి
వెంకటప్ప	డీటీసీ, తిరుపతి	సీసీఎస్, తిరుపతి
చిరంజీవిరావ్	పీసీఆర్, తిరుపతి	వీఆర్-ఎస్పీ, తిరుపతి
అమర్‌నాథ్‌రెడ్డి	సీసీఎస్, తిరుపతి	సైబర్ క్రైమ్ సెల్, తిరుపతి
రవీంద్రనాథ్	సీసీఎస్, తిరుపతి	వీఆర్-ఎస్పీ, సత్యసాయి జిల్లా
శివప్రసాద్	ట్రాఫిక్ పీఎస్, తిరుపతి	వీఆర్-ఎస్పీ, అనంతపురం
రామచంద్రారెడ్డి	సైబర్ క్రైమ్, తిరుపతి	ఎస్సీ, ఎస్టీ సెల్, తిరుపతి
నాగరాజు	ఎస్సీ, ఎస్టీ సెల్, తిరుపతి	వీఆర్-ఎస్పీ, తిరుపతి
బీవీ.శ్రీనివాసులు	వీఆర్-ఎస్పీ, తిరుపతి	వీఆర్-ఎస్పీ, అనంతపురం
ఎం.శ్రీనివాసులు	ఎస్‌బీ, తిరుపతి	డీసీఆర్‌బీ, తిరుపతి
మధుబాబు	వీఆర్-ఎస్పీ, తిరుపతి	వీఆర్-ఎస్పీ, సత్యసాయి జిల్లా
వినోద్‌కుమార్	వీఆర్-ఎస్పీ, తిరుపతి	సైబర్ క్రైమ్, తిరుపతి
భాస్కర్‌నాయక్	పుత్తూరు రూరల్ సర్కిల్	పుత్తూరు రూరల్ సర్కిల్
అంజుయాదవ్	శ్రీకాళహస్తి 1 టౌన్	డీటీఆర్‌బీ, తిరుపతి
శ్రీనివాసరెడ్డి	ఒంగోల్ రూరల్ సర్కిల్, ప్రకాశం జిల్లా	నాయుడుపేట యూపీఎస్, తిరుపతి జిల్లా
నరసింహారావ్	నాయుడు యూపీఎస్, తిరుపతి జిల్లా	శాంతమగులూరు సర్కిల్, బాపట్ల జిల్లా
జగన్‌మోహన్‌రావ్	రేంజ్, వీఆర్	నాయుడుపేట సర్కిల్, తిరుపతి
వీరసోమయ్య	నాయుడుపేట సర్కిల్, తిరుపతిరేంజ్	వీఆర్, గుంటూరు
కృష్ణారెడ్డి	కమాండ్ కంట్రోల్ సెంటర్, తిరుపతి	నరసారావ్‌పేట 1 టౌన్

ఎంబీయూలో ఘనంగా స్పోర్ట్స్ డే

చంద్రగిరి : మండలంలోని శ్రీసాయినాథ నగర్‌లో ఉన్న మోహన్ బాబు యూనివర్సిటీలో ఆదివారం ఘనంగా స్పోర్ట్స్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ ప్రభుదేవా హాజరయ్యారు. ముందుగా ప్రభుదేవాకు ఎంబీయూ చాన్సలర్ మంచు మోహన్‌బాబు, ప్రో చాన్సలర్ మంచు విష్ణు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం స్పోర్ట్స్ డే జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రభుదేవా మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతి ఒక్కరూ రాణించాలన్నారు. మానసిక దృఢత్వంతోపాటు శారీరకంగా బలంగా తయారైతే ఎంతటి లక్ష్యమైనా సులువుగా సాధించవచ్చని సూచించారు. స్పోర్ట్స్ డేను వేడుకగా క్రమశిక్షణతో నిర్వహించడం అభినందనీయమన్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం విద్యాసంస్థగా ప్రారంభమై నేడు యూనివర్సిటీ స్థాయికి ఎదగడం వెనుక మోహన్‌బాబు కృషి, దీక్ష, పట్టుదల ఉన్నాయని కొనియాడారు. క్రీడలు, విద్యపై దష్టి సారించి గొప్పగా భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో విశేష ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాపోటీల్లో విజేతలకు మోహన్‌బాబు, ప్రభుదేవా, మంచు విష్ణు చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం చాన్సలర్ మోహన్‌బాబుతో కలసి ప్రభుదేవా, కళాకారులు నృత్యం చేసి ఆహుతులను అలరించారు. ఈ క్రమంలోనే ముఖ్యఅతిథి ప్రభుదేవాను ఘనంగా సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు.

అట్టహాసంగా ఫ్రెషర్స్ డే : ఎంబీయూలో నూతనంగా ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుదేవా మాట్లాడుతూ ఇంత గొప్పగా విద్యాసంస్థలను నిర్వహించడం మోహన్‌బాబుకే సాధ్యమైందని ప్రశంసించారు. కార్యక్రమాల్లో ఎంబీయూ ఈడీ వినయ్ మహేశ్వరి, వీసీ నాగరాజా రామారావు, రిజిస్ట్రార్ సారధి తదితరులు పాల్గొన్నారు.


సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తున్న మోహన్‌బాబు, ప్రభుదేవా, విష్ణు

అలంకరించిన కోడెగిత్తతో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



రంకెలేసిన కోడెగిత్తలు

రంకెలేస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు యువత పోటీపడ్డారు. ఉరకలెత్తే ఉత్సాహంతో ఎద్ల ముందుకు దూకారు. పలకలను చేజిక్కించుకుని సంతోష పడ్డారు. ఆదివారం రామచంద్రాపురం మండలం నూతిగుంటపల్లెలో అట్టహాసంగా పరుష పందేలు నిర్వహించారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గ్రామానికి రావడంతో యువకులు ఉప్పొంగిపోయారు. విశేషంగా అలంకరించిన ఎద్లను నేతలకు చూపించి మురిసిపోయారు. వారి సమక్షంలో గిత్తలను లొంగదీసుకుని విజయగర్వంతో సంబరాలు జరుపుకున్నారు. - రామచంద్రాపురం


ఎద్లను నిలువరిస్తున్న యువకులు

తమిళనాడు బియ్యం పట్టివేత


సీజ్ చేసిన బియ్యం, లారీతో విజిలెన్స్ అధికారులు

సూళ్లూరుపేట : చెన్నై నుంచి నెల్లూరుకు లారీలో అక్రమంగా తరలిస్తున్న తమిళనాడు రేషన్ బియ్యం బస్తాలను విజిలెన్స్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. సూళ్లూరుపేటకు చెందిన ఎం.ప్రవీణ్ అనే వ్యక్తి తమిళనాడులో చౌక బియ్యాన్ని తక్కువరేటుకు కొనుగోలు చేసి లారీలో తీసుకువస్తున్నాడనే సమాచారం అందడంతో విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టి లారీని పట్టుకున్నారు. అందులోని 330 బియ్యం బస్తాలను సీజ్ చేశారు. లారీతోపాటు డ్రైవర్ మురళిని పోలీసులకు అప్పగించారు. బియ్యం బస్తాలను సివిల్ సప్లయి గోదాముకు తరలించారు. ఈ మేరకు ప్రవీణ్, మురళిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.